చిన్నారుల భవితకు భరోసా

- ప్రత్యేక అవసరాల పిల్లల సంక్షేమానికి ప్రాధాన్యం
- నిరామయతో ఆరోగ్య రక్ష
- నిత్యం వ్యాయామంతో పురోగతి
- అద్భుత ఫలితాలు సాధిస్తున్న వైద్యులు


చంద్రగిరిలోని భవిత కేంద్రం


సమూహంగా బోధన (ఫైల్)


నడవ లేని వారికి వీల్‌చైర్స్‌లో శిక్షణ (ఫైల్)

చంద్రగిరి(తిరుపతి రూరల్): ప్రత్యేక అవసరాలు గల పిల్లల సంక్షేమంపై వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ పెట్టింది. సర్వశిక్ష అభియాన్ ఆధ్వర్యంలో భవిత కేంద్రాలు ఏర్పాటుచేసి ప్రత్యేక శిక్షణ ఇస్తోంది. ప్రత్యేక ఉపాధ్యాయులు, ఫిజియోథెరపిస్టుల ద్వారా వారిలో ఆత్మ విశ్వాసాన్ని నింపుతోంది. ఒక్కో వైకల్యానికి ఒక్కో పరికరంపై సాధన చేయిస్తూ పిల్లల భవితకు బంగారు బాటలు వేస్తోంది. చంద్రగిరి నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో 121 మంది ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారులు ఉన్నారు. వారి కోసం మండల కేంద్రాల్లో భవిత కేంద్రాలను ఏర్పాటుచేశారు. ఒక్కో కేంద్రంలో ఒక ఫిజియోథెరపిస్టు, ఐఈఆర్టీ సమ్మిళిత విద్యా వనరుల ఉపాధ్యాయులను నియమించి 5 నుంచి 14 ఏళ్లలోపు పిల్లలకు పుట్టుకతో వచ్చిన వైకల్యాన్ని దూరం చేసేందుకు వ్యాయామ చికిత్సలు అందిస్తున్నారు. వీరికి విద్యా బోధన కూడా సాగుతోంది. ఈ కేంద్రాలకు రావడానికి రవాణా ఖర్చులకుగాను ప్రభుత్వం నెలకు రూ.300, ఉపకార వేతనం నెలకు రూ.700 నుంచి రూ.1500 వరకు పది నెలలు అందిస్తోంది. అంతే కాకుండా ఎస్కార్ట్ అలవెన్స్ కింద రూ.300 ఇస్తోంది. ఐఈఆర్టీలు పిల్లలకు ఆటపాటలతో విద్యాబుద్ధులు నేర్పిస్తున్నారు. స్పీచ్, ఫిజియోథెరపిస్టులు, సైకాలజిస్ట్ పిల్లల ఇళ్లకు వెళ్లి వైద్య సేవలు అందిస్తున్నారు. అవసరమైన వారికి ట్రై సైకిళ్లు, వినికిడి యంత్రాలతోపాటు ఒక్కొక్క విద్యార్థికి రూ.10 వేల విలువైన ఆట వస్తువులు అందజేశారు. ఫ్లాష్ కార్డుల ద్వారా అక్షరాలు, బొమ్మలు, చిత్రాలను, పండుగల చిహ్నాలను చూపించడం ద్వారా బోధన చేస్తున్నారు. ఫ్రూట్ బోర్డుపై కాయలు, కూరగాయలు, పండ్లు ఏర్పాటు చేసి వాటిని తొలగించి, తిరిగి అమర్చడం వంటివి సాధన చేయిస్తున్నారు.

నిరామయతో ఆరోగ్య భద్రత

ప్రత్యేక అవసరాలు గల పిల్లల ఆరోగ్య పరిరక్షణలో భాగంగా నిరామయ ఆరోగ్య భద్రతా పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తోంది. దీని కింద ఇచ్చే గుర్తింపు కార్డులతో ప్రభుత్వ, కార్పొరేట్ ఆస్పత్రుల్లో వైద్యం చేయించుకోవచ్చు.


భవిత కేంద్రంలో చిన్నారులకు ఫిజియోథెరపి చేస్తున్న ఫిజియోథెరపిస్ట్ (ఫైల్)


చిన్నారికి ప్రత్యేక బోధన (ఫైల్)

ప్రతిభకు ప్రోత్సాహం

ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారుల్లోని ప్రతిభను వెలికితీసేందుకు ఐఈఆర్టీలు కృషి చేస్తున్నారు. వారికి ఇష్టమైన రంగంలో శిక్షణ ఇచ్చి చిన్నచిన్న బొమ్మలు తయారు చేయిస్తున్నారు.

స్విస్ బాల్‌పై వ్యాయామం

స్విస్ బాల్‌పై వ్యాయామం చేయిస్తూ శరీరంలోని కండరాలు బలపడేలా కృషి చేస్తున్నారు. వ్యాయామం చేయిస్తూ మెడ నిటారుగా నిలబడడం, వెన్నెముక, ఉదర కండరాలు బలిష్టంగా తయారుకావడం, పక్కటెముకలు మంచి ఆకృతి సంతరించుకునేలా చేస్తున్నారు. నడక సవ్యంగా సాగడానికి పార్లర్ బార్‌పై సాధన చేయిస్తున్నారు.

తల్లిదండ్రులు ప్రయత్నం చేయాలి



భవిత కేంద్రంలో చిన్నారులకు ఒక రోజు ఫిజియోథెరపిస్టు వ్యాయామాలు చేయిస్తారు. ఇంటి వద్ద కూడా వ్యాయామం చేయించాలి. తద్వారా శారీరక ఎదుగుదల, అవయవాల సంపూర్ణత్వం సాధించవచ్చు.

–వెంకటరాజేశ్వరి, ఉపాధ్యాయిని, భవిత కేంద్రం, చంద్రగిరి

ఇంట్లో సాధన అవసరం



ప్రత్యేక ప్రతిభావంతులు ఇంట్లో కూడా వ్యాయామం, యోగా సాధన చేయాలి. పిల్లలపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. ప్రతి రోజూ భవిత కేంద్రానికి తీసుకురావడం ద్వారా సక్రమంగా వ్యాయామం నేర్చుకుంటారు.

–శ్యామల, ఉపాధ్యాయిని, భవిత కేంద్రం, చంద్రగిరి

సేవలు భేష్



మా అబ్బాయి మహమ్మద్ అనాష్ బహుళ వైకల్యంతో బాధపడుతున్నాడు. బెడ్ నుంచి లేచే పరిస్థితి లేదు. ఎంతో బాధపడేవాళ్లం. భవిత కేంద్రంలో చేర్పించిన తర్వాత కూర్చుంటున్నాడు. కొన్ని ఆటలు ఆడుతున్నాడు. భవిత కేంద్రం సేవలు ఎంతో భేషుగ్గా ఉన్నాయి.

–రెహమద్, విద్యార్థి తల్లి

క్లుప్తంగా

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల: శ్రీవారిని ఆదివారం ఎంపీ మాగుంట శ్రీనివాస్ రెడ్డి, కేంద్ర సహాయ శాఖ మంత్రి ఎల్.మురుగన్, రాష్ట్ర మంత్రి నారాయణ స్వామి, ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి, ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుజాత, ఏపీ టూరిజం చైర్మన్ వరప్రసాద్ రెడ్డి దర్శించుకున్నారు. వారికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనం అందించగా అధికారులు లడ్డు ప్రసాదాలతో సత్కరించారు.

సంస్కృత వర్సిటీలో హర్ గర్ కా తిరంగ్

తిరుపతి సిటీ: ఆజాదీకా అమృత్ మహోత్సవంలో భాగంగా ఆగస్టు 15ను పురస్కరించుకుని ఆదివారం స్థానిక జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో ఎన్ఎస్ఎస్ యూనిట్–4 ఆధ్వర్యంలో హర్ గర్‌కా తిరంగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రోగ్రామ్ ఆఫీసర్ వి.సేతురాం వలంటీర్స్‌తో కలిసి విశ్వవిద్యాలయంలోని ప్రతి భవనంపైనా త్రివర్ణ పతాకం ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ చందూలాల్, అసిస్టెంట్ ఇంజినీర్ భరణి, రవి పాల్గొన్నారు.

ఆక్రమణ నుంచి భూమిని కాపాడండి

చంద్రగిరి(తిరుపతి రూరల్): శ్రీనివాసమంగాపురం ఎస్టీ కాలనీ సమీపంలో ఉన్న తన వ్యవసాయ భూమిని ఒక వ్యక్తి కబ్జా చేశాడని, న్యాయం చేయాలని చంద్రగిరికి చెందిన దుష్యంతుడు వేడుకున్నారు. ఆయన ఆదివారం చంద్రగిరిలో మీడియాతో మాట్లాడారు. శ్రీనివాసమంగాపురం ఎస్టీ కాలనీ సమీపంలో తనకు తాతల కాలం నుంచి వ్యవసాయ భూమి ఉందని తెలిపారు. దాన్ని నరసింగాపురానికి చెందిన వెంకటరామయ్యశెట్టి ఆక్రమించుకుని ఫెన్సింగ్ వేశాడని ఆరోపించారు. అడ్డుకునేందుకు ప్రయత్నిస్తే తనపై దాడికి ప్రయత్నిస్తున్నాడని, తనకు ప్రాణరక్షణ కల్పించడంతో పాటు తన భూమిని కాపాడాలని కోరారు.

నడక మార్గంలో భక్తుల రక్షణపై దృష్టి సారించాలి

తిరుపతి కల్చరల్: తిరుమలకు వెళ్లే నడక మార్గాల్లో భక్తుల రక్షణకు టీటీడీ దృష్టి సారించాలని అఖిలపక్ష నేతలు డిమాండ్ చేశారు. యశోదానగర్‌లోని ఎంబీ భవన్‌లో సీపీఎం నగర కార్యదర్శి ఆధ్వర్యంలో ఆదివారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, జనసేన నేత ముని శంకర, ఆమ్ ఆద్మీ పార్టీ నేత నగేష్, సీపీఐ నేత శివ, డీఎంసీ భాస్కర్ పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ తిరుమలకు వెళ్లే నడక మార్గాల్లో కంచె నిర్మించాలన్నారు. నాలుగైదు చోట్ల నడక మార్గం కింద అండర్ ప్రొసెస్ వంటి నిర్మాణాలు చేపడితే వన్యప్రాణులు రాకపోకలకు అంతరాయం ఉండదని తెలిపారు. లక్షిత కుటుంబానికి రూ.50 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వడంతో పాటు వారి కుటుంబంలో ఒకరికి టీటీడీ ఉద్యోగం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

ముగిసిన క్రెడాయి ప్రాపర్టీ ఎక్స్‌పో


మాట్లాడుతున్న సిపాయి సుబ్రమణ్యం

తిరుపతి కల్చరల్: ఎయిర్ బైపాస్ రోడ్డులోని పీఎల్ఆర్ కన్వెన్షన్ హాల్‌లో మూడు రోజులుగా నిర్వహించిన క్రెడాయి ప్రాపర్టీ ఎక్స్‌పో–23 ఆదివారం రాత్రి ముగిసింది. ఇందులో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని బిల్డింగ్ నిర్మాణం, సొంతింటి కల సాకారానికి కల అవకాశాలను పొందారు. ముగింపు సమావేశంలో ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. తిరుపతిలో ప్రతి ఏటా క్రెడాయి ప్రాపర్టీ ఎక్స్‌పో నిర్వహిస్తూ నిర్మాణ రంగంలో ప్రజలకు ఎంతో దోహద పడుతున్నారని కొనియాడారు. క్రెడాయి ప్రాపర్టీ ఎక్స్‌పోను విజయవంతం చేసినందుకు క్రెడాయి ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మహిళా వర్సిటీ వీసీ భారతి, క్రెడాయి చైర్మన్ శ్రీనివాసులు, అధ్యక్షుడు రాంప్రసాద్, కార్యదర్శి రాజేష్‌బాబు, కోశాధికారి రాజశేఖర్‌రావు, ప్రభాకర్, నరసింహారెడ్డి, బీజేపీ నేత భానుప్రకాష్‌రెడ్డి పాల్గొన్నారు.

దండి మార్చ్ ప్రతిమల ప్రారంభానికి ఏర్పాట్లు పూర్తి



తిరుపతి తుడా: జాతీయ, స్వాతంత్య్రోద్యమ స్ఫూర్తిని నింపేందుకు దండి మార్చ్ ప్రతిమలను అత్యద్భుతంగా రూపొందించినట్లు తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ హరిత తెలిపారు. ఆమె ఆదివారం ఎంఆర్ పల్లిలో కూడలిలో ఏర్పాటుచేస్తున్న దండి మార్చ్ ప్రతిమలను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ ప్రతిమలను సోమవారం సాయంత్రం టీటీడీ చైర్మన్, తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డి ప్రారంభిస్తారని చెప్పారు. అలానే ఎంఆర్‌పల్లి కూడలి విస్తరణ, బాలాజీ కాలనీ ఫ్రీ లెఫ్ట్, తిరుపతి కోర్టు రోడ్డు విస్తరణ, అభివృద్ధి పనుల ప్రారంభానికి ఏర్పాట్లు చేశామన్నారు. ఆగస్టు 15న స్వాతంత్య్ర దినోత్సవంలో భాగంగా సామవాయి మార్గం కూడలి వద్ద వంద అడుగుల జాతీయ జెండాను ఆవిష్కరిస్తామన్నారు. సామవాయి, డాక్టర్ వైఎస్ఆర్ మార్గ్ రోడ్లను త్రివర్ణ విద్యుత్ వెలుగులతో సుందరీకరించామని చెప్పారు. ప్రారంభోత్సవంలో నగర మేయర్ శిరీష, డిప్యూటీ మేయర్లు ముద్ర నారాయణ, భూమన అభినయ్‌రెడ్డి, స్థానిక కార్పొరేటర్లు పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమంలో డీఈఈ మహేష్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు


నృత్యం చేస్తున్న కళాకారులు

తిరుచానూరు(చంద్రగిరి): వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా తిరుచానూరు సమీపంలోని శిల్పారామంలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. మహారాష్ట్రకు చెందిన అభినయ ఇన్స్టిట్యూట్ ఆఫ్ రీసెర్చ్ ఫైన్ ఆఫ్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో నాట్య గురువు డాక్టర్ చిత్ర విశ్వనాథన్ పర్యవేక్షణలో కళాకారులు నృత్యప్రదర్శనలు ఇచ్చారు. కళాకారులు కళాశ్రీ, మీనా సంతోష్, స్నేహ అంజన్, ప్రియ సతీష్, రంజని రాఘవన్, వర్ష విశ్వనాథన్‌ను ఏవో ఖాదర్‌వలి సత్కరించి, జ్ఞాపకలు అందజేశారు. ఈ కార్యక్రమంలో రాధాకృష్ణ, పప్పి, వరప్రసాద్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

పోటీలకు విశేష స్పందన

తిరుపతి కల్చరల్: స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని వే ఫౌండేషన్ సహకారంతో రీజనల్ సైన్స్ సెంటర్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన చిత్రలేఖన పోటీలకు విద్యార్థుల నుంచి విశేష స్పందన లభించింది. భారతదేశం విజన్ –2047 అనే అంశంపై చేపట్టిన ఈ పోటీలకు తిరుపతి, చిత్తూరు, శ్రీకాళహస్తి, కడప, అన్నమయ్య, చెన్నైకి చెందిన సుమారు 45 పాఠశాలల నుంచి 600 మంది విద్యార్థులకు హాజరయ్యారు. సైన్స్ సెంటర్ ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ శ్రీనివాస్ నెహ్రూ మాట్లాడుతూ విజేతలకు మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు సైన్స్ సెంటర్‌లో నిర్వహించే కార్యక్రమంలో బహుమతులతో పాటు ప్రశంసా పత్రాలు అందజేయనున్నట్లు తెలిపారు.

సహజత్వమే భారతి కథల సౌందర్యం

తిరుపతి కల్చరల్: గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు మాట్లాడే భాషకు పట్టం కడుతూ జీవితానుభవాలనే కథా వస్తువులుగా ఎండపల్లి భారతి కథలు రాశారని పలువురు వక్తలు కొనియాడారు. తిరుపతి జిల్లా అభ్యుదయ రచయితల సంఘం ఆధ్వర్యంలో భూమన్ అధ్యక్షతన ప్రముఖ రచయిత్రి ఎండపల్లి భారతి రాసిన జాలారి పూలు పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఇందులో భూమన్, డాక్టర్ డీఎం.ప్రేమావతి, ఉమామహేశ్వరరావు, రచయిత్రి కిరణ్‌కుమారి మాట్లాడుతూ భారతి కథలు పల్లెల్లోని దళితుల దీన స్థితి, రాయలసీమ ప్రాంత స్థితిగతులకు అద్దం పడుతున్నాయని పేర్కొన్నారు. పుస్తక ప్రచురణ కర్త పాండురంగారావు, రచయిత్రి ఎండపల్లి భారతి, తిరుపతి రచయితల సంఘం కన్వీనర్ మన్నవ గంగాధరప్రసాద్, తిరుపతి ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు మోహన్‌కుమార్ రాజు, సాహితీవేత్తలు, సాకం నాగరాజు, శైలకుమార్, తమటం రామచంద్రారెడ్డి, సురేంద్ర రొద్ద, కట్టమంచి బాలకృష్ణారెడ్డి, గంగవరం శ్రీదేవి, ఎన్.విశ్వనాథరెడ్డి, వాకా ప్రసాద్, యువశ్రీ మురళి, నెమిలేటి కిట్టన్న పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



తిరుపతి సిటీ: ఎస్వీ వెటర్నరీ వర్సిటీ 1983 బ్యాచ్ బీవీఎస్సీ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం వర్సిటీ ఆడిటోరియంలో ఘనంగా జరుపుకున్నారు. అందరూ సంఘంగా ఏర్పడి వర్సిటీ ఆవరణలో సిమెంట్ బెంచ్‌లు ఏర్పాటు చేశారు. భవిష్యత్తులో వర్సిటీలో విద్యార్థులకు ఉపయోగపడే కార్యక్రమాలు నిర్వహించడానికి కృషి చేయనున్నట్లు తెలిపారు. అనంతరం తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులు శివరామకృష్ణయ్య, వీహెచ్ రావు, పార్థసారథి, కరుణానిధి, సుబ్రమణ్యం నాయుడును ఘనంగా సన్మానించారు. ఈ సమావేశంలో పూర్వవిద్యార్థులు వెటర్నరీ వర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ చెంగల్వరాయులు, పంచాయతీ రాజ్ అడిషనల్ కమిషనర్ సుధాకర్, ఈశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి సేవలో ప్రముఖులు

తిరుచానూరు(చంద్రగిరి): తిరుచానూరు పద్మావతి అమ్మవారిని ఆదివారం సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ భూషణ్ రామకృష్ణ గవాయ్, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ దర్శించుకున్నారు. వారికి టీటీడీ ఈవో ధర్మారెడ్డి, ఆలయ అర్చకులు స్వాగతం పలికి అమ్మవారి దర్శనం కల్పించారు. అనంతరం ఆశీర్వాద మండపంలో వేద పండితులు ఆశీర్వచనం పలుకగా, ఈవో ధర్మారెడ్డి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

సంతలో అన్నదానం

చంద్రగిరి(తిరుపతి రూరల్): ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి కుటుంబం రైతన్నలకు, చిరువ్యాపారులకు, నియోజకవర్గ ప్రజలకు ఎల్లప్పుడు అండదండగా ఉంటుందని ఎంపీటీసీ బుల్లెట్ చంద్రమౌళి రెడ్డి కొనియాడారు. ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి సహకారంతో వైఎస్సార్ సీపీ చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం చంద్రగిరి వారపు సంతలో రైతులు, వ్యాపారులు, చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు అన్నదానం చేశారు. వైఎస్సార్‌సీపీ డివిజన్ అధ్యక్షుడు కుప్పిరెడ్డి భాస్కర్ రెడ్డి, రెడ్డివారిపల్లి సర్పంచ్ ప్రకాష్ రెడ్డి, నవీన్, రాజశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

పరాశరేశ్వరుని దర్శించుకున్న టీటీడీ చైర్మన్ సతీమణి


భూమన రేవతికి చిత్రపటం అందజేస్తున్న శ్రీధర్ రెడ్డి

తిరుచానూరు(చంద్రగిరి): తిరుచానూరు సమీపంలోని యోగి మల్లవరంలో ఉన్న కామాక్ష సమేత పరాశరేశ్వర స్వామిని ఆదివారం టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి సతీమణి రేవతి, కుటుంబ సభ్యులు దర్శించుకున్నారు. వారికి ఆలయ చైర్మన్ శ్రీధర్ రెడ్డి స్వాగతం పలికి దర్శనం కల్పించారు. అనంతరం స్వామి, అమ్మవార్ల చిత్రపటాన్ని అందజేశారు.

ఉచితంగా త్రివర్ణ పతాకాల పంపిణీ

తిరుపతి కల్చరల్: స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని సిరి సంపద వెంచర్స్ ప్రతినిధులు ఆదివారం తిరుపతికి చెందిన మిస్ ఇండియా విన్నర్ భావన చేతుల మీదుగా త్రివర్ణ పతాకాలను ఉచితంగా పంపిణీ చేశారు. సిరి సంపద వెంచర్ సంస్థ చైర్మన్ ప్రకాష్ గుప్త మాట్లాడుతూ తమ సంస్థ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. సంస్థ ప్రతినిధి సరిత పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ కమిషనర్

తిరుపతి తుడా: తిరుపతి నగర ప్రజల సమస్యల పరిష్కారం సోమవారం డయల్ యువర్ కమిషనర్, స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ తెలిపారు. ప్రజలు ఉదయం 9:30 గంటల నుంచి 10:30 వరకు 0877–22 27208కి కాల్ చేసి సమస్యలు తెలియజేయవచ్చన్నారు. అలాగే 10:30 నుంచి ప్రజలు నేరుగా అధికారులకు ఫిర్యాదులు అందజేయవచ్చన్నారు.

తిరుపతి గంగమ్మకు పూజలు

భాకరాపేట: చిన్నగొట్టిగల్లు చెరువు కట్టపై వెలసిన తిరుపతి గంగమ్మకు శ్రావణ ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. వేకువ జామున అభిషేకం, అర్చనలు చేశారు. విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు.

నీచ రాజకీయాలు మానుకోవాలి


మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నేత రమేష్‌రెడ్డి

తిరుపతి కల్చరల్: తిరుపతిలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, టీడీపీ నేతలు రాజకీయ విమర్శలకు దిగుతున్నారని ఎంఆర్‌పల్లి వైఎస్సార్ సీపీ నేతలు రమేష్‌రెడ్డి, కుమారస్వామిరెడ్డి ధ్వజమెత్తారు. వారు ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. 14 ఏళ్లు అధికారంలోనున్న టీడీపీ హయాంలో తిరుపతి ప్రజల సంక్షేమాన్ని, నగర అభివృద్ధిని పట్టించుకోని మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, నేడు తిరుపతి అభివృద్ధిపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంఆర్‌పల్లి పర్యటన పేరుతో సుగుణమ్మ, రోడ్లపై అసత్య ఆరోపణలు చేయడం సిగ్గుచేటన్నారు. ఇప్పటికైనా నీచ రాజకీయాలు మానుకోవాలని, లేకుంటే ప్రజలు గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. డిష్ చంద్ర, నాదమునిరెడ్డి, కుమార్, ప్రకాష్‌రెడ్డి, సోమశేఖర్‌రెడ్డి, జీవ, సద్దాబాబు, అనిల్ రాయల్, బాషా, మునిసుబ్రమణ్యం పాల్గొన్నారు.

వేడుకగా బండి కుంభం


ఎద్దుల బండిపై ఆహారం తీసుకెళ్తున్న భీముడి పాత్రధారి

చంద్రగిరి(తిరుపతి రూరల్): చంద్రగిరి మహాభారత ఉత్సవాల్లో భాగంగా ఆదివారం బండికుంభం ఘనంగా నిర్వహించారు. భీముడి వేషధారిని బండి కుంభంపై చంద్రగిరి పట్టణంలో ఊరేగించారు. రాత్రి బకాసుర వధ నాటకం ఆకట్టుకుంది. ఈ కార్యక్రమానికి ఉభయ దాతలుగా చంద్రగిరి జెడ్పీటీసీ చిలకూరి యుగంధర్ రెడ్డి, అగరాల సర్పంచ్ అగరాల భాస్కర్, వైఎస్సార్ సీపీ డివిజన్ అధ్యక్షుడు అగరాల దేవారెడ్డి, చంద్రగిరి ఉపసర్పంచ్ నగిరి చంద్రశేఖర్ రెడ్డి వ్యవహరించారు. వారిని గ్రామ పినపెద్ద విరూపాక్షి శంకర్ రెడ్డి, ఎంపీటీసీ బుల్లెట్ చంద్రమౌళి రెడ్డి సత్కరించారు. కార్యక్రమంలో కుప్పిరెడ్డి భాస్కర్ రెడ్డి, అంగేరి చంద్రశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడిగా సూర్యకిరణ్


సూర్యకిరణ్‌ను అభినందిస్తున్న మోహిత్‌రెడ్డి

తిరుపతి రూరల్: అంబేడ్కర్ యువజన సంఘం ఓటేరు అధ్యక్షుడిగా సూర్యకిరణ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఓటేరులో ఆదివారం యువజన సంఘం కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా దళితుల హక్కుల కోసం నిరంతరం పోరాటాలు చేస్తున్న సూర్యకిరణ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అంతకు ముందు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సూర్యకిరణ్‌ను వైఎస్సార్ సీపీ చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి అభినందించారు. పేదలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో రూరల్ ఎంపీడీవో వెంకటనారాయణ, సర్పంచ్ లక్ష్మి, ఉప సర్పంచ్ చంద్రమౌళి, ముని, కృష్ణ, మురళి పాల్గొన్నారు.

పరామర్శ



అనారోగ్యంతో బాధపడుతూ స్విమ్స్‌లో చికిత్స పొందుతున్న కార్పొరేటర్ హనుమంత్ నాయక్‌ను ఆదివారం రాత్రి డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి పరామర్శించారు.

–తిరుపతి తుడా

ఉచిత వైద్య శిబిరానికి స్పందన


వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ వికాస్

తిరుపతి తుడా: స్థానిక రెడ్డి అండ్ రెడ్డి కాలనీలోని యూవీ కార్డియాక్ కేర్ ఆస్పత్రి వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి మంచి స్పందన లభించింది. రోగులకు బీపీ, షుగర్, ఈసీజీ పరీక్షలను చేసి మందులు పంపిణీ చేశారు. డాక్టర్ వికాస్ మాట్లాడుతూ గుండె సంబంధిత సమస్యలపై అప్రమత్తంగా ఉండాలన్నారు.

వీనుల విందు చేసిన ప్రణతి గాత్ర కచేరి

తిరుపతి కల్చరల్: టీటీడీ రామ్‌నగర్ క్వార్టర్స్‌లోని గీతామందిరంలో నిర్వహిస్తున్న తిరుపతికి చెందిన సాంస్కృతిక సంస్థ రాగ రసజ్ఞ సంగీతోత్సవాలు ఆదివారం ముగిశాయి. ఇందులో భాగంగా హైదరాబాద్‌కు చెందిన వైజర్స్ ప్రణతి చేసిన గాత్ర కచేరి ఆహూతులకు వీనుల విందు చేసింది. కాంభోజి రాగం, రూపక తాళంలో త్యాగరాజ కృతి ఏలరా కృష్ణా సంకీర్తనను గానం చేసి అలరించారు. వయోలిన్‌పై వాసుశాస్త్రి, మృదంగంపై కార్తికేయ ఆదినారాయణ శర్మ సహకారం అందించారు. ఈ సందర్భంగా కళాకారిణి ప్రణతి, కళాకారులను సాంస్కృతిక సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు హెచ్ఎస్.వెంకటేష్, కె.రామ్‌కుమార్ ఘనంగా సత్కరించారు.

త్రివర్ణ కాంతులు

జిల్లాలో స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలకు భారీ ఏర్పాట్లు చేపడుతున్నారు. మునుపెన్నడూ లేనివిధంగా ఈ సారి ప్రధాన కూడళ్లను ప్రత్యేకంగా ముస్తాబు చేస్తున్నారు. రైల్వేస్టేషన్లకు సైతం త్రివర్ణ రంగులతో విద్యుద్దీపాలు ఏర్పాటు చేసి మురిసిపోతున్నారు. తిరుపతిలో వీధులైట్లు కూడా త్రివర్ణ రంగులతో అలంకరించి ఆకట్టుకుంటున్నారు.

– సాక్షి, తిరుపతి


విద్యుత్ కాంతుల మధ్య తిరుపతి రైల్వేస్టేషన్




విద్యుత్ వెలుగుల్లో కలెక్టర్ నివాసం, ఎమ్మార్ పల్లి-మహిళా యూనివర్సిటీ సీతమ్మ మార్గం

వైఎస్సార్‌సీపీ పరిశీలకుల నియామకం


దామినేటి కేశవులు, మునీశ్వర్‌రెడ్డి, గణపతినాయుడు, యుగంధర్‌రెడ్డి, ఉపేంద్రారెడ్డి


బుజ్జిరెడ్డి మస్తాన్

తిరుపతి రూరల్: చంద్రగిరి నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో వైఎస్సార్ సీపీ మండల పరిశీలకులను(అబ్జర్వర్లు)ను నియమిస్తూ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. పాకాలకు దామినేటి కేశవులు, చంద్రగిరికి కొత్తపాటి మునీశ్వరరెడ్డి, రామచంద్రాపురానికి వీరపల్లి గణపతి నాయుడు, ఎర్రావారిపాలెంకు చిల్లకూరు యుగంధర్‌రెడ్డి, తిరుపతి రూరల్(ఈస్ట్)కు అమ్మిటి ఉపేంద్రారెడ్డి, తిరుపతి రూరల్ (వెస్ట్)కు సమాధి బుజ్జిరెడ్డి, చిన్నగొట్టిగల్లుకు షేక్ మస్తాన్ నియమితులయ్యారు. గ్రామ స్థాయిలో పార్టీ పటిష్టతకు ప్రతి ఒక్కరినీ భాగస్వాములను చేసుకుని ముందుకు సాగాలని ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి వారికి సూచించారు.